క్లుప్తంగా

విజేతలుగా తిరిగి రండి

● ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య



జిల్లా హాకీ జట్టుతో నిర్వాహకులు

కర్నూలు (టౌన్): ఈనెల 3 నుంచి 5 వరకు అనకాపల్లి జిల్లా నిమ్మపల్లిలో నిర్వహించనున్న అండర్–17 బాల బాలికల స్కూల్‌గేమ్స్ హాకీ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి విజేతలుగా తిరిగి రావాలని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.లక్ష్మయ్య సూచించారు. గురువారం స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జట్టు సభ్యులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, కార్యదర్శి బాషా పాల్గొన్నారు.

☛ క్రీడా ఎంపిక పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించిన వారికే జిల్లా జట్టులో చోటు ఉంటుందని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జి.లక్ష్మయ్య అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శిలంబం, షూటింగ్ బాల్, సాఫ్ట్ టెన్నిస్, మాల్కం స్కై మార్షల్ క్రీడాంశాల ఎంపిక పోటీలు నిర్వహించారు.

కాశీకి శివలింగాలు

కర్నూలు కల్చరల్: స్థానిక రెవెన్యూ కాలనీలోని భరత మాత ఆలయంలో గత నెల 29 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు బాలాజీ సమితి ఆధ్వర్యంలో బంక మట్టితో తయారు చేసిన 25 వేల శివలింగాలను గురువారం వారణాసికి పంపారు. హిందూ బంధువులను ఐక్యం చేసి భక్తి భావం పెంపొందించడానికి శివ కోటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చల్లా దామోదర్‌రెడ్డి, సభ్యులు తులసమ్మ, వసుంధరమ్మ పాల్గొన్నారు.

4న 'చారిత్రక గాథలు' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ఇంటెలెక్చువల్స్ కలెక్టివ్ ఆధ్వర్యంలో ఈనెల 4న ఉదయం 10 గంటలకు కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ రచయిత ఎస్.డి.వి. అజీజ్ రచించిన 'చారిత్రక గాథలు' పుస్తకావిష్కరణ జరుగుతుందని సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఖదీరుల్లా, ఇనాయతుల్లా గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు.పుస్తకావిష్కరణలో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ పార్వతీదేవి పాల్గొంటారన్నారు.

స్వార్థం కోసం సంఘాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు

కర్నూలు(అర్బన్): 2022లో జరిగిన మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఎన్నికల్లో ఓడిపోయి నవారు కొందరు తమ స్వార్థం కోసం సంఘాన్ని భ్రష్టు పట్టించే ప్రయత్నం చేస్తున్నారని సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు నర్రా పేరయ్య గురువారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు.సంఘంలోనే ఉంటూ మరో సంఘాన్ని 2021లో ఏర్పాటు చేసుకుని సభ్యులకు తెలియకుండానే ఈసీ మెంబర్లుగా చూపించారన్నారు. మొదటి సంఘం సభ్యత్వాన్ని రద్దు చేసుకోకుండా మరో సంఘం లెటర్ ప్యాడ్ పట్టుకుని తిరగడం ఎంత వరకు సమంజమో ఆలోచించాలన్నారు.

నేటి నుంచి కేసీ కెనాల్‌పై ట్రాన్స్‌ఫార్మర్ల తొలగింపు

కర్నూలు(రాజ్‌విహార్): సుంకేసుల బ్యారేజీ నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వరకు కేసీ కెనాల్‌పై వేసుకున్న వ్యవసాయ మోటార్ల కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు శుక్రవారం నుంచి తొలగించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 16కిలో మీటర్ల పొడవులో 200 ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా 650 కనెక్షన్లు ఉన్నాయని, వీటి తొలగింపు చర్యలకు రైతులు సహకరించాలని కోరారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కమిటీ ఏర్పాటు

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా కమిటీని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు మాలేకర్ శ్రీనివాస్ గురువారం ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా కిరణ్‌కుమార్, తేజోరామ్, మస్తాన్‌బీ, రవీంద్రనాయుడు, నారాయణ, ప్రధాన కార్యదర్శులుగా ఉల్చాల లక్ష్మణ్ నాయుడు, మంజునాథ్, కార్యదర్శులుగా బ్రహ్మయ్య, దర్గా స్వామి, పురుషోత్తంగౌడ్, జంగాపురం ఈరన్న, బాలాజీ, రాఘవేంద్ర, కోశాధికారిగా అశోక్, సహ కోశాధికారిగా మహేంద్ర, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా కిషోర్, సోమశేఖర్, వీరేష్, మల్లారెడ్డి, నరసప్ప, చంద్రశేఖర్ యాదవ్, బోయ బాలాజీ కమిటీలో ఉన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: స్థానిక ఓల్డ్‌సిటీ కుమ్మరి వీధిలోని రాంబొట్ల ఆలయం ధర్మకర్తల మండలికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కెం.రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వా రు ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఆలయ కార్యనిర్వహణాధికారి వద్ద దర ఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. దర ఖాస్తులను మద్దూరునగర్‌లోని దేవదాయ ధర్మ దాయశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

పథకాలు పొంది ఆర్థికంగా ఎదగండి

● కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ సూచించారు. గురువారం స్థానిక 44వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీతారామ్ నగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధి ని అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ను ఆర్థికంగా గట్టెక్కించాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని, దీని కోసం నవరత్నాలు పథకాలు తెచ్చిన ట్లు చెప్పా రు. అర్హత ఉన్న ప్రతి కుటుంబం వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేశ్వరరెడ్డి, గోశాల చైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి, నాయకులు మెత్రి, జ్యానందం, భాను, స్వా తి, ఖాజా, రాము యాదవ్, జంగిలమ్మ తదితరులు పాల్గొన్నారు.



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



స్థానికుల నుంచి వినతిపత్రం తీసుకుంటున్న ఎమ్మెల్యే

ప్రభుత్వం నిధులిస్తున్నా పనిచేయరా

● ఇంజినీరింగ్ అధికారులపై ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ ఆగ్రహం

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం నిధులిస్తున్నా కాంట్రాక్టర్లతో పనిచేయించలేకపోవడమేమిటని ఏపీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఆసుపత్రిలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణ పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో జాప్యం చేస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని, కనీసం ఈ నెలాఖరులోగా నైనా సర్జికల్ ఆంకాలజీ, ప్యాలియేటివ్ మెడిసిన్ విభాగాలు ప్రారంభమయ్యేలా చూడాలని ఆదేశించారు. పాలియేటివ్ కేర్‌లో ఓపీ, జనరల్ వార్డులను సిద్ధం చేయాలన్నారు. కాంట్రాక్టర్ ఆసుపత్రికి రూ.8.5 లక్షల విద్యుత్ బిల్లులు బకాయి ఉన్నారని తెలుసుకుని మండిపడ్డారు. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. లేకపోతే నేరుగా తామే హెచ్‌డీఎస్ ఖాతాకు నిధులు మళ్లిస్తామన్నారు. అనంతరం ఆయన డయాగ్నోస్టిక్ బ్లాక్ పనులు పరిశీలించారు.



స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పనులను పరిశీలిస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి

ఎలక్ట్రికల్ ఇంజినీర్లు సైతం పనులు నెమ్మదిగా చేస్తున్నారని సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ఎండీ దృష్టికి తీసుకురాగా సదరు ఇంజినీరింగ్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో రోగులకు ఇక్కడి నుంచే వైద్యపరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఈ రమేష్ రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి, రేడియాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ రాధారాణి తదితరులు ఉన్నారు.

పిత్తవాహికలో ఇరుక్కుపోయిన స్టెంట్

● శస్త్రచికిత్సతో తొలగించిన వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): పిత్తవాహికలో ఇరుక్కుపోయిన స్టెంట్‌ను స్థానిక కిమ్స్ హాస్పిటల్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ ఎస్.జె.జానకిరామ్ శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. వివరాలు ఆయన గురువారం వెల్లడించారు. ఆళ్లగడ్డ ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల యువకుడికి రెండేళ్ల క్రితం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎండోస్కోపి చేసి పిత్తవాహికలో ఉన్న రాళ్లు తొలగించి ఒక స్టెంట్ వేశారు. నెలరోజుల తర్వాత స్టెంట్ తీసేసి, గాల్‌బ్లాడర్ కూడా తొలగించాల్సి ఉంటుంది. అయితే స్టెంట్ విషయాన్ని మరిచిపోయి, కామెర్లు తగ్గిపోయాయని అలాగే ఉండిపోయాడు. ఇటీవల మరోసారి అతనికి కామెర్లు, జ్వరం రావడంతో కిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. ఎండోస్కోపిక్ రెట్రోగ్రేడ్ కొలంగిపోయపాక్రియాటోగ్రఫి(ఈఆర్‌సీపీ) చేయగా ఇంతకుముందు వేసిన స్టెంట్‌కు తుప్పు పట్టి దాని చుట్టూ రాళ్లు ఏర్పడ్డాయని గుర్తించారు. ముందుగా కామెర్లు తగ్గడానికి మరో స్టెంట్ వేసి, రెండు వారాల తర్వాత లాపరోస్కోపి చేసి గాల్‌బ్లాడర్ తీసేశారు. 'ఓపెన్ సర్జరీ ద్వారా స్టెంట్, రాళ్లు తీసేశాం. వారం పాటు ఆసుపత్రిలో ఉంచుకుని కోలుకున్నాక డిశ్చార్జ్ చేశాం' అని డాక్టర్ జానకిరామ్ వివరించారు.

వైద్యశిబిరాలతో పేదలకు ఎంతో మేలు



జగనన్న ఆరోగ్య సురక్ష బ్యాగ్‌ను అందజేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు చేకూరుతోందని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. గురువారం ఆయన నగరంలోని రోజా, జొహరాపురం యూపీహెచ్‌సీల పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను సందర్శించారు. అవసరమైన వారికి ఉన్నత వైద్యం కోసం ప్రభుత్వ వైద్యశాలలకు రెఫర్ చేయాలని వైద్యులకు సూచించారు. ఆశాలు, ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు సూచించాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటించాలని తెలిపారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడిని ఖండించండి

కర్నూలు(సెంట్రల్):పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడిని ఖండించాలని ఎస్‌యూసీఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు డి.రాఘవేంద్ర కోరారు. గురువారం ఎస్‌యూసీఐ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఇజ్రాయెల్ దాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వి.హరీష్‌కుమార్‌రెడ్డి, తేజోవతి, నాగన్న, బాబు, రోజా, మల్లేష్, శంకరప్ప పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 15న చేపట్టనున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ కోరారు. గురువారం సుందరయ్య భవన్‌లో చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను పాటిస్తూ మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతూ అభివృద్ధిని గాలికొదిలేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో సీపీఎంకు అధికారం ఇస్తే అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పీఎస్ రాధాకృష్ణ, బి.రామాంజనేయులు, జి.రామకృష్ణ, కేవీ నారాయణ, ఆనంద్‌బాబు, సి.గురుశేఖర్, వై.నగేష్ పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ



విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

కర్నూలు (టౌన్): లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. సాఫ్ట్‌బాల్‌లో భువనేష్, స్వాతి, బేస్‌బాల్‌లో ఉస్మాన్‌బాషా, ఫుట్‌బాల్‌లో అభిషేక్ ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎన్నికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

8న విద్యా సంస్థల బంద్‌కు పిలుపు

కర్నూలు(సెంట్రల్): విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించకూడదని, కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతూ నవంబర్ 8న విద్యా సంస్థల బంద్ పాటించాలని వామపక్ష పార్టీల విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ పిలునిచ్చాయి. గురువారం సీఆర్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఖండ, మహేంద్ర హాజరై బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక యువతను తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిరుద్యోగులను మోసం చేశారన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అమరవీరుల బలిదానం వృథా కాలేదు

కర్నూలు కల్చరల్: అయోధ్య అమరవీరుల బలిదానాల ఫలితమే శ్రీరామ జన్మభూమి మందిర నిర్మాణమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు నంది రెడ్డి సాయిరెడ్డి అన్నారు. భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హుతాత్మ దివస్‌ను నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, నగర అధ్యక్షులు టి.సి.మద్దిలేటి, భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ టి.ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్వర్, విభాగ్ సేవా ప్రముఖ్ పి.గురుమూర్తి, నగర కార్యదర్శి ఈపూరి నాగరాజు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, మెడికల్ ఆఫీసర్ రామచంద్రరావు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

నందవరం: పొలంలో నిలిచిన వర్షపు నీరు కిందకు వెళ్లేందుకు సహకరించాలని కోరిన మాల శేఖర్ అనే వ్యక్తిపై దాడి జరిగింది. ఈ ఘటన మండల పరిధిలోని ఇబ్రహీంపురం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ తిమ్మయ్య తెలిపిన వివరాలు.. గ్రామంలో మాల శేఖర్, బోయ బొజ్జన్న పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. అయితే శేఖర్ పొలం పైన ఉండడంతో వర్షపు నీరు బొజ్జన్న పొలంలోకి పారుతుండేది. ఈ ఏడాది వర్షపు నీరు కిందకు పారకుండా బొజ్జప్ప కుమారులు బోయ రామాంజిని, ఉరుకుంది, నరసింహులు అడుకట్ట వేశారు. దీంతో ఈ రోజు గ్రామ పెద్దల వద్ద పంచాయతీకి పిలిచి వర్షపు నీరు కిందకు ప్రవహించాలని చెప్పిన మాల శేఖర్‌పై బోయ రామాంజిని, ఉరుకుంది, నరసింహులు, బొజ్జన్న దాడి చేసి గాయపరిచారు. కులం పేరుతో దుషించి తీవ్రంగా గాయ పరిచారు. ప్రస్తుతం మాల శేఖర్ ఎమ్మిగనూరు ఆసుపత్రికిలో చికిత్స పొందుతున్నాడు. శేఖర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

చేతులు శుభ్రం చేసుకోవాలి


ఆస్పరి: భోజనం చేసే ముందు ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రం చేసుకోవాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా కో–ఆర్డినేటర్ హేమలత విద్యార్థినులకు సూచించారు. గురువారం స్థానిక ఆస్పరి కేజీబీవీలో నిర్వహిస్తున్న విఫ్స కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల విద్యార్థినులకు ఐరన్ మాత్రలు వేసి వాటి గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉండాలని సూచించారు. డాక్టర్ రఘురామిరెడ్డి, సీహెచ్ఓ రాజేశ్ ఆచారి పాల్గొన్నారు.



ఆస్పరి కేజీబీవీలో విద్యార్థినికి ఐరన్ మాత్రలు వేస్తున్న దృశ్యం

పొలాల రస్తా చూపండి

పాణ్యం: పొలాలకు వెళ్లే రస్తా సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం పాణ్యంలో డబ్లింగ్ పనుల పరిశీలనకు వచ్చిన రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ మురళీకి రైతులు వినతిపత్రం అందించారు. రైతులు మాట్లాడుతూ.. అన్‌మ్యాడ్ లెవెల్‌క్రాసింగ్ 174వ గేట్‌ను రైతులకు తెలియకుండా తొలగించారన్నారు. గేటు అవతల సుమారు 250 ఎకరాల సాగు భూమి ఉన్నట్లు తెలిపారు. దీంతో ఆ పొలాలకు వెళ్లేందుకు రైతులకు రస్తాలేకుండా పోయిందని వివరించారు. ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేస్తామని చెప్పిన రైల్వే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. దీంతో వాగుపై నిర్మించిన బ్రిడ్జి కింద నుంచి రాకపోకలు సాగిస్తున్నామని, ఆ మార్గంలో యంత్రాలు, వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న డబ్లింగ్ పనుల్లో భాగంగా రెండవ ట్రాక్ నిర్మాణం జరుగుతోందని, వాగుపై నిర్మించే బ్రిడ్జిని నాలుగు మీటర్ల ఎత్తు పెంచితే యంత్రాలు రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అధికారులు చొరవ తీసుకొని బ్రిడ్జి ఎత్తు పెంచాలని కోరారు. రైతులు సమస్యను విన్న ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



రైల్వే ఇంజినీర్లతో మాట్లాడుతున్న రైతులు

కోలుకోలేక వ్యక్తి మృతి

ఎమ్మిగనూరురూరల్: పట్టణానికి చెందిన జీఈ వీరేష్ గౌడ్ (48) రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూల్లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం సాయంత్రం మృతి చెందాడు. వివరాలు.. పట్టణానికి చెందిన జీఈ వీరేష్‌గౌడ్ గత నెల 25వ తేదీ రాత్రి కోసిగి రోడ్డులోని కల్లు డిపో నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తూ వ్యవసాయ మార్కెట్ యార్డు రోడ్డు దాటుతుండగా మంత్రాలయం వైపు నుంచి వచ్చిన కర్ణాటక లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరేష్‌గౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టడంతో ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య శిరీష, ముగ్గురు కుమార్తెలు సంతానం ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు చనిపోవడంతో కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయింది. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం బాలాజీ నగర్‌లో పర్యటించారు. 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అమడగుంట్ల కృష్ణారెడ్డితో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధిని వివరించి పత్రాలను అందించారు. గతంలో ఎప్పుడు లేని విధంగా పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇళ్ల పట్టాలు అందించామన్నారు. పేద విద్యార్థులు చదువుతున్న పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నాడు–నేడు ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకే చేర్చామన్నారు. ఇవి ఇలాగే కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ భీమేశ్వర్ రెడ్డి, నాయకులు గిరి ప్రసాద్, జగన్ యాదవ్, రాము, గౌతమ్, శేఖర్, రాజు, సూరి, శ్రీనివాస గౌడ్, సచివాలయ కన్వీనర్లు కరీం, ఇర్షద్ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడి తండ్రికి సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: మండల పరిధిలోని ఈ.తాండ్రపాడు గ్రామానికి చెందిన బోయ జయరాముడికి తన కుమారుడి వైద్యం ఖర్చుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని గురువారం కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ తన గృహంలో అందజేశారు. ఈ సందర్భంగా జయరాముడు మాట్లాడుతూ తన కుమారుడు మహేష్ లివర్ సమస్యతో బాధపడుతున్నాడన్నారు. ఇదే విషయం ఎమ్మెల్యే సుధాకర్ దృష్టికి తీసుకెళ్లగా సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారన్నారు. త్వరలోనే హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని స్టార్ హాస్పిటల్‌లో లివర్ మార్పిడి చేయించుకుని తన కుమారుడిని బతికించుకుంటానన్నారు. ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే సుధాకర్‌కు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.

శాంతి భద్రతల సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు

● డీఎస్పీ విజయశేఖర్

కర్నూలు: శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ హెచ్చరించారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామమైన ఎదురూరులో గురువారం డీఎస్పీ పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజలతో సమావేశమై మాట్లాడారు. ఎవరైనా ఫ్యాక్షన్ జోలికి వెళ్తే రౌడీషీట్లు ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలుగుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎలాంటి సమస్య తలెత్తినా పోలీసులను ఆశ్రయించి శాంతియుత మార్గంలో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీరామ్ పాల్గొన్నారు.



ఎదురూరులో మాట్లాడుతున్న డీఎస్పీ విజయశేఖర్

అవినీతిపై ప్రతి పౌరుడు పోరాడాలి



మాట్లాడుతున్న ఏసీబీ సీఐ తేజేశ్వరరావు

కర్నూలు: అవినీతికి వ్యతిరేకంగా ప్రతి పౌరుడు పోరాడాలని ఏసీబీ ఇన్‌స్పెక్టర్ తేజేశ్వర్‌రావు సూచించారు. అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాల్లో భాగంగా గురువారం ఓర్వకల్లు మండలంలోని పవర్ గ్రిడ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ తేజేశ్వర్‌రావు ప్రసంగించారు. ప్రతి ఒక్కరిలో అవినీతికి వ్యతిరేకంగా ప్రశ్నించేతత్వం అలవడాలని, తద్వారా అవినీతి నిర్మూలనలో భాగం కావాలని తెలిపారు. టోల్‌ఫ్రీ నంబర్ 14400, మొబైల్ యాప్ 14400 ద్వారా ప్రజలు ఫిర్యాదులను ఆడియో, వీడియో రూపంలో సాక్ష్యాలతో సహా అప్‌లోడ్ చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అవినీతి నిరోధక చట్టాలపై ఏసీబీ ఇన్‌స్పెక్టర్ వెంకటకృష్ణారెడ్డి అవగాహన కల్పించారు. సీఐ ఇంతియాజ్ బాషా, పవర్‌గ్రిడ్ స్టేషన్ జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, డిప్యూటీ మేనేజర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయండి

కర్నూలు (టౌన్): ఓటర్ల ముసాయిదా జాబితా కచ్చితత్వంతో ఉండాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. గురువారం స్థానిక నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఓటర్ల ముసాయిదా జాబితా సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓటర్లకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలున్నా స్వీకరించడం, పరిశీలించడం అంతా పారదర్శకంగా జరగాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి ముసాయిదా జాబితాలో మార్పులు చేర్పులకు సిఫార్సు చేయాలని సూచించారు. కమిషనర్ వెంట ఎలక్షన్ డీటీ ధనుంజయ్ ఉన్నారు.



జాబితాను పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగులకు ఆరోగ్య భద్రత



ప్రసంగిస్తున్న డీజీఎం లేఖామీనన్

● డీజీఎం జి.లేఖామీనన్

కర్నూలు (అర్బన్): భారతీయ స్టేట్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ఎస్‌బీఐ డీజీఎం జి.లేఖామీనన్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక మౌర్యా ఇన్ విభు పరిణయ సమావేశ మందిరంలో ఐదు జిల్లాల ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లేఖామీనన్ మాట్లాడుతూ ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగులకు అనేక సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. 75 ఏళ్ల వయస్సు పైబడిన 11 మంది విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు.